

'వి'నాయకుడు

8లో▸

వినాయకుడు.. నాయకుడై నడిపిస్తున్నాడు. ఏళ్లుగా వారిని ఐక్యంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేలా చూస్తున్నాడు. ఐక్యంగా, పర్యవరణ హితంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న సంఘాలపై కథనం.

జిల్లా ఆస్పత్రి.. ఇక మెడికల్ కళాశాల బోధనాసుపత్రి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా ఆసుపత్రిని నిర్మల్ మెడికల్ కళాశాల బోధన ఆసుపత్రిగా ట్రాన్స్‌ఫర్ చేస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక జిల్లా ఆసుపత్రి, జిల్లా ప్రసూతి ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధీనంలో కొనసాగనున్నాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /23.6

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

విష జ్వరాల విజృంభణ..!

* ప్రతీ ఇంట్లో కనీసం ఒకరికి నుస్తీ
* ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
* అల్లాడుతున్న పిల్లలు
* పెరుగుతున్న డెంగీ కేసులు
* రోగులతో కిటకిటలాడుతున్న వార్డులు

పది రోజులుగా జ్వరం..



నేరడిగొండకు చెందిన ఇతని పేరు రవి. పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందినా నయం కాకపోవడంతో మంగళవారం జిల్లా ఆస్పత్రికి వచ్చి అడ్మిట్ అయ్యాడు. రాగానే వైద్యులు పరీక్షించారు. రక్త, మూత్ర పరీక్షల కోసం నమూనాలు పంపారు. రిపోర్టు వస్తేనే ఏ జ్వరమో తెలుతుంది.
– రవి, నేరడిగొండ

జ్వరం, కాళ్ల నొప్పులు తగ్గడం లేదు..



కడెం మండలం పోచంపాడ్‌కు చెందిన ఈమె పేరు వెంకవ్వ. 20 రోజులుగా చలిజ్వరంతో బాధపడుతోంది. ఆర్‌ఎంపీ చికిత్స చేసినా తగ్గకపోగా, ఒంటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో చికిత్స కోసం గురువారం జిల్లా ఆస్పత్రికి వచ్చింది.
– వెంకవ్వ, పోచంపాడ్



పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

గ్రౌండ్ రిపోర్ట్

నిర్మల్‌చైన్‌గేట్: ఉదయం ఉక్కపోత.. సాయంత్రం ఈదురుగాలులు.. మధ్యలో చిటపట చినుకులు.. వింత వాతావరణ పరిస్థితులతో జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామం, పట్టణం అని తేడాలేకుండా అందరూ జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతీ ఇంట్లో కనీసం ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. వైరల్ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బాధితులు కూడా పెరుగుతుండడంతో ఏ జ్వరమో తెలుసుకునేందుకు బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ రోజు రోజుకూ పెరుగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో తగ్గిపోవాల్సిన జ్వరం వారం వరకు తగ్గకపోవడం, ప్లేట్‌లెట్స్ తగ్గడం ఆందోళనకు గురిచేస్తోంది.

పెరుగుతున్న జ్వరపీడితులు..

కొన్ని రోజులుగా జిల్లా ఆస్పత్రికి వచ్చే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. 'సాక్షి' గురువారం జిల్లా ఆస్పత్రితోపాటు, భైంసా ఏరియా ఆస్పత్రి, ఖానాపూర్ సీహెచ్‌సీని సందర్శించింది. మూడు ఆస్పత్రుల్లో జ్వరబాధితులు చికిత్స కోసం బారులు తీరారు. ఇక ఆస్పత్రుల్లోని బెడ్లు బాధితులతో నిండిపోయాయి. ఓపీ కౌంటర్ వద్ద క్యూ కనిపించింది. జిల్లా ఆస్పత్రిలోని మేల్, ఫీమేల్ వార్డుతోపాటు ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. ఈ ఓపీ గదిలో జ్వరపీడితులను మాత్రమే పరీక్షించి చికిత్స అందిస్తున్నారు. నిత్యం ఓపీకి 150 నుంచి 200 మంది వస్తుండగా, వారిలో 40 నుంచి 50 మంది అడ్మిట్ అవుతున్నారు.

భయపెడుతున్న డెంగీ..

విషజ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించగా డెంగీ, మలేరియాగా తేలుతోంది. గత నెలలో వందకు పైగా డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఈ సంఖ్య పెరుగుతోంది. ప్రతిరోజూ ఐదుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. ఈ నెలలో డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయి. డెంగీ, మలేరియా బాధితులకు నాలుగైదు రోజులు చికిత్స అందించిన తరువాత డిశ్చార్జ్ చేస్తున్నారు. రోగులకు ప్లేట్‌లెట్స్ పడిపోకుండా అన్ని రకాల చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

పొంతన లేని లెక్కలు...

జిల్లావ్యాప్తంగా డెంగీ జ్వరాలతో ప్రజలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితోపాటు ప్రైవేటు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. జిల్లా మలేరియా అధికారి ఇచ్చిన సమాచారం ప్రకారం ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 41 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి. కానీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం గత నెలలో కేవలం చిన్నపిల్లలకు 40 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యులు తెలిపారు. ఇవికాక మిగతా ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీతో చికిత్స పొందుతున్న రోగులు వందల్లో ఉన్నారు.

అల్లాడుతున్న చిన్నారులు..

జిల్లా ఆస్పత్రిలోని పీడియాట్రిక్ విభాగానికి వచ్చే జ్వరపీడితుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. రోజూ 130 నుంచి 150 మంది చిన్నారులు ఓపీ విభాగానికి వస్తుండగా అందులో 30 మందికిపైగా జ్వరంతో అడ్మిట్ అవుతూ చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం చిన్నారుల విభాగం నిండిపోయింది. ఒక్కో బెడ్‌పై ఇద్దరికి వైద్యచికిత్స అందిస్తున్నారు. బెడ్లు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

పెరిగిన ఓపీ..



వారం రోజులుగా జిల్లాలో సీజనల్ జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే అవుట్ పేషెంట్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సాధారణంగా రోజుకు 500 నుంచి 600 వరకు అవుట్ పేషెంట్లు వస్తుండగా బుధవారం రోజు 758 ఓపీ నమోదైంది. గురువారం జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నా 426 ఓపీ నమోదైంది. వాతావరణ మార్పుల కారణంగా జ్వరం, జలుబు, గొంతు ఇన్ఫెక్షన్ వంటి సమస్యలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు.



చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న సేవల గురించి డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

వారం రోజులుగా జిల్లా ఆస్పత్రి ఓపీ వివరాలు..

తేదీ	ఓపీ సంఖ్య
14	555
15	439
16	702
18	494
19	609
20	758
21	423

వైద్యుడిని సంప్రదించాలి..



ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం. వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలి. జంక్‌ఫుడ్, ఆయిల్ ఫుడ్ తీసుకోవద్దు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఏ జ్వరం వచ్చినా డాక్టర్‌ను సంప్రదించాలి.
–డాక్టర్ గౌతమ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు

ఆందోళన వద్దు..



సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆస్పత్రులకు ఓపీ సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు చికుగున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు. డెంగీ వచ్చినా జిల్లా ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉంది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలి.
– డాక్టర్ సునీల్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్

భైంసాపై జ్వరాల పంజా..

భైంసాటౌన్: వైరల్ జ్వరాలతో భైంసా పట్టణవాసులు విలవిలలాడుతున్నారు. భైంసా పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి ప్రతీరోజు వందల సంఖ్యలో జ్వర బాధితులు క్యూకడుతున్నారు. వారం రోజులుగా 700లకు పైగానే ఓపీ నమోదవుతోంది. ప్రతీరోజు వంద నుంచి 200 వరకు రక్త నమూనాలు సేకరిస్తున్నారు. రక్త పరీక్షల ఫలితాల్లో ఎక్కువగా ఇన్‌ఫెక్షన్ కారణంగానే జలుబు, దగ్గు, గొంతునొప్పి కూడిన జ్వరం వస్తుందని ఉంటున్నారు. ఇక ఈ సీజన్‌లో డివిజన్ పరిధిలో ముథోల్‌లో ఒకటి, భైంసాలో రెండు డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు. టైఫాయిడ్, సీఆర్‌పీ కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నట్లు పేర్కొన్నారు.



భైంసా ఏరియాస్పత్రి ఓపీ వద్ద బారులు తీరిన మహిళలు

ఖానాపూర్ ఆస్పత్రి కిటకిట..

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వారం రోజులుగా రోగులతో కిటకిటలాడుతుంది. ప్రతీరోజు 350 నుంచి 500 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారని వైద్యులు తెలిపారు. సుమారు 50 మంది ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. రక్త కణాలు తగ్గిన వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. నిర్మల్, మెట్‌పల్లి, నిజామాబాద్ పట్టణాలకు వెళ్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ జ్వరాలతోపాటు రెండు రోజుల క్రితం ఒక డెంగీ కేసు నమోదైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్ తెలిపారు.



ఆస్పత్రిలో అడ్మిట్ అయిన పేషెంట్లు

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

* కలెక్టర్ వరుణ్‌రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, ప్రసూతి ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా ఆసుపత్రితోపాటు ప్రసూతి ఆస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్.ప్రసాద్, డాక్టర్ సునీల్, జిల్లా ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 భారతి ఉన్నారు.

'పల్లెప్రగతి'తోనే గ్రామాల అభివృద్ధి

కుంటాల: పల్లె ప్రగతి పథకంతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని అంబకంటి తాండాలో గురువారం పర్యటించి మాట్లాడారు. పల్లెప్రగతి ద్వారా గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. డంపింగ్ యార్డ్, వైకుంఠ ధామం, నర్సరీ, పల్లె ప్రకృతి వనం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు ఇంకుడు గుంతల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సర్పంచ్ జాదవ్ శంకర్, ఎంపీటీసీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు ఓటు హక్కుపై జిల్లాస్థాయి పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై కళాశాల, పాఠశాల విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్, ఎలక్టోరల్ అధికారి వరుణ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 9 నుంచి 12వ తరగతి, డిగ్రీ, పాలిటెక్నిక్ డిప్లొమా, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అర్హులని వివరించారు. స్కిట్(నాటక ప్రదర్శన), పద్యం లేదా పాటల రచన విభాగాలలో యువత, పట్టణ ఓటర్ల ప్రమేయం, నైతిక ఓటింగ్, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ఎన్నికలు, ప్రేరేపణ లేని ప్రజాస్వామ్య పండుగకు సంబంధించిన ఏదైనా అంశంపై స్థాయి పోటీలు ఉంటాయని వెల్లడించారు. నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు నారాయణవర్మ 94407 86515, తాడిశెట్టి రవికాంత్ 94405 69766 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దసరాకు ఆర్టీసీ అడ్వాన్స్ బుకింగ్స్

నిర్మల్‌టౌన్: దసరా సందర్భంగా అక్టోబర్ 15 నుంచి 29 వరకు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకుల కోసం గురువారం నుంచి అడ్వాన్స్ బుకింగ్ అవకాశం కల్పించినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. పోను, రాను టికెట్లను ముందుగానే బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నారు. ముందస్తు టికెట్లు tsrtconline.in ద్వారా, లేదా నిర్మల్ బస్టాండ్ కౌంటర్‌లో పొందాలని సూచించారు. ఈ అవకాశం ఈనెల 30 వరకు ఉంటుందని, సద్వినియోగించుకోవాలని కోరారు.

నేడు జెడ్పీ సమావేశం

నిర్మల్‌టౌన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సకాలంలో హాజరు కావాలిని పేర్కొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్ తహసీల్దార్‌కు గురువారం సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించలేని పక్షంలో ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. నోటీస్ ఇచ్చినవారిలో జిల్లా కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి ఉన్నారు.

ప్రశాంతంగా నిమజ్జన వేడుక

* కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్, వినాయకసాగర్ చెరువు పరిసరాలను గురువారం సాయంత్రం పరిశీలించారు. ప్రధాన వీధుల్లో తిరుగుతూ.. ఏ ప్రాంతాల నుంచి శోభాయాత్ర వెళ్తుంది.. పోలీస్ బందోబస్తును ఎలా చేయాలనే విషయాలను పరిశీలించారు. ట్రాఫిక్ ఆంక్షలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు కలిసి పనిచేయాలన్నారు. ప్రార్థన మందిరాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛందంగా సేవలందించే వాలంటీర్లను సద్వినియోగించుకోవాలని సూచించారు.



శోభాయాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వారివెంట నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పట్టణ సీఐ పురుషోత్తం, సంబంధిత అధికారులు ఉన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చర్యలు

భైంసాటౌన్: వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ తెలిపారు. తన కార్యాలయంలో హిందూ ఉత్సవ సమితి, ముస్లిం మతపెద్దలతో గురువారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పోలీసులకు సహకరించాలన్నారు. ఈ మేరకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నిమజ్జన శోభాయాత్ర నిర్ణీత మార్గంలోనే వెళ్తుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలతోపాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్‌రూం నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ ఎల్.శ్రీను, ఎస్సైలు ఉన్నారు.

తానూరు: గణేశ్ నిమజ్జన ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. మండల కేంద్రంలోని కళ్యాణమండపంలో గురువారం శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఊరేగింపు ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉత్సవ కమిటీలు చూసుకోవాలన్నారు. భైంసా సీఐ వినోద్, తహసీల్దార్ లింగమూర్తి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

* మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయాలను కొనసాగిద్దామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. కొండా లక్ష్మణ్ వర్ధంతి పురస్కరించుకొని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పద్మశాలి సంఘం సభ్యులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమాల్లో కొండా లక్ష్మణ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1969లో తొలి దశ పోరాటంలో పాల్గొన్నారన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి నర్సయ్య, అడెపు భూమన్న, కుర్ర నరేశ్, మెరుగు పవన్ పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించి నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె విరమణ

నిర్మల్‌చైన్‌గేట్: ఎమ్మెల్సీ కవిత, విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డితో సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసి శుక్రవారం నుంచి విధులకు హాజరవుతామని తెలిపారు. సమ్మెకు సహకరించిన డీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు వెంటనే మినిమం టైం స్కేల్ అమలు చేస్తూ ప్రతీ ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తూ ఉద్యోగులకు ఫునరల్ చార్జెస్, 12 నెలల జీతం, మహిళలకు 180 రోజుల ప్రసూతి సెలవులు సమ్మె కాలానికి జీతం ఇవ్వటానికి ప్రభుత్వం అంగీకరించినట్లు వివరించారు. ఇది తాత్కాలిక విరమణ మాత్రమే అని, ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకుంటే తిరిగి సమ్మె చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు భోజన్న, నరేష్, నవత, రాధిక, ప్రధాన కార్యదర్శి రత్నం, అలేఖ్య, రాము, కోశాధికారి గజేందర్‌సింగ్, మీడియా కన్వీనర్ కప్పల సుధాకర్, భలేరావ్ గంగాధర్, సలహా సభ్యులు, ఫిరోజ్, జయశ్రీ, రాజ్యలక్ష్మి, గీతారాణి, మహేందర్ పాల్గొన్నారు.



డీఈవోతో జేఏసీ నాయకులు

అంగన్‌వాడీలను చర్చలకు పిలవాలి

నిర్మల్‌చైన్‌గేట్: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.రాజమణి కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఉద్యోగులు గొడుగులు పట్టుకుని నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలను పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. నిరసనలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, జిల్లా నాయకులు హేమలత, నర్సమ్మ, దేవిక, లావణ్య, రమ్య ఏఐటీయూసీ అనుబంధ నాయకులు రమ, సుగుణ, జయశ్రీ పాల్గొన్నారు.



వర్షంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ ఉద్యోగులు

'హరిత నిధి'ని పరిశీలించిన డీఎఫ్‌వో

నర్సాపూర్(జి): మండల కేంద్రం శివారులో ఏర్పాటు చేసిన హరిత నిధి కేంద్రీయ నర్సరీని డీఎఫ్‌వో రాంకిషన్‌యాదవ్ గురువారం పరిశీలించారు. అటవీ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇటీవల అటవీప్రాంతంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నాటిన మొక్కలను పరిశీలించారు. మొక్కలను కాపాడాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌వో జైపాల్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో అనుపమ ఉన్నారు.

క్లుప్తంగా

వెండి పాదాల బహూకరణ


పాదాలకు పూజలు చేస్తున్న భక్తులు

తానూరు: భోసిలో నెలకొల్పిన కర్రవినాయకుడికి భైంసా పట్టణానికి చెందిన గోవింద్‌వార్ రమ సాయినాథ్ దంపతులు గురువారం స్వామివారి ఆలయంలో పదకొండున్నర తులాల వెండి పాదాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వెండి పాదాలు బహూకరిస్తామని ముడుపులు కట్టామని, ఈ ఏడాది చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు దంపతులను శాలువతో సన్మానించి కర్ర వినాయకుని చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మురళి, అధ్యక్షులు నాగనాథ్ ఉన్నారు.

జాతీయ కమిటీలో జిల్లా వాసికి చోటు


పూసం సచిన్

ఎదులాపురం: తమిళనాడు రాష్ట్రంలోని నమ్మక్కల్ పట్టణంలో నిర్వహించిన ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాల్గవ మహాసభలకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు పూసం సచిన్ హాజరయ్యారు. ఈ సభకు దేశం నలుమూలల నుంచి 400మంది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభలో వివిధ ఆదివాసీ సమస్యలపై చర్చించి వాటిపై పలు పోరాటాల రూపకల్పనపై చర్చించారు. హక్కుల కోసం పోరాడడానికి ప్రత్యేకంగా జాతీయ కమిటీని నియమించగా అందులో పూసం సచిన్‌కు చోటు కల్పించారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముధోల్: ముధోల్‌లోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అభిషేక్ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. 17ఇయర్స్ విభాగంలో భైంసాలో నిర్వహించిన పోటీల్లో అభిషేక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అదే విధంగా పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్వార్థక్, ముత్యం, లలిత, వనితలు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, అభినందించారు.

మంత్రిపై అసత్య ప్రచారం చేసిన వారిపై కేసు

నిర్మల్‌టౌన్: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసిన వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. సీఐ కథనం ప్రకారం... మంత్రిని అవమానిస్తూ వీడియోలు, దొంగఓట్లతో గెలిచాడంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్, సాయి చెల్లె (సాయన్న), విజ్జు, నరేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇరువురి రిమాండ్

ఎదులాపురం: సమస్యల పరిష్కారంలో భాగంగా అంగన్‌వాడీలు ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. నిరసన క్రమంలో ఎస్సైపై దాడికి ప్రోత్సహించినందుకు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కిరణ్, దేవేందర్‌లను రిమాండ్‌కు తరలించినట్లు టుటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వినాయకుడు

నవరాత్రుల్లో భాగంగా వినాయకుడు ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో ఉత్సవాల్లో భాగంగా వివిధ వాడల్లో, గ్రామాల్లో భక్తుల దర్శనం కోసం వివిధ రూపాల్లో కొలువుదీరాడు. పలువురు సభ్యులుగా ఏర్పడి విఘ్నేశ్వరుడిని ఏళ్లుగా ఏర్పాటు చేస్తూ భక్తిభావాన్ని చాటడంతో పాటు ఐక్యంగా ముందుకుసాగుతున్నారు. అలాగే పలుచోట్ల పర్యావరణానికి హాని లేకుండా మట్టి, పేపర్‌తో గణపతి ప్రతిమలను తయారు చేయించి పూజలు నిర్వహిస్తున్నారు. వినాయక ఉత్సవాలు భక్తిభావంతో పాటు ప్రజల్లో సఖ్యతను సైతం చాటేందుకు ఎంతగానో దోహదం చేస్తున్నాయి. ఆయా జిల్లాలో పలువురు గ్రూపులుగా ఏర్పడి ఏళ్లుగా లంబోదరుడిని నెలకొల్పుతున్న పలు మండపాల ప్రత్యేకతపై కథనం..

గరుడ పక్షిపై గణనాథుడు


గరుడపక్షిపై కొలువుదీరిన గణనాథుడు

బోథ్: మండల కేంద్రానికి చెందిన లయన్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు అందరిని ఆకట్టుకుంటోంది. రెక్కలతో ఎగురుతున్న గరుడపక్షిపై గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణ నాథున్ని చూడటానికి అనేకమంది వస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రైతులను ఏకం చేసిన లంబోదరుడు


కుంటాలలో రైతును దీవిస్తూ ఉన్న వినాయకుడు..

కుంటాల: ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ వినాయక విగ్రహాల ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేశారు. ఆ మాటను నిలబెట్టేందుకు కుంటాలకు చెందిన రైతులు ఏకమయ్యారు. కాలనీలో 20మంది రైతులంతా మణికంఠ గణపతి కార్యవర్గంగా ఏర్పడ్డారు. 11ఏళ్లుగా వినాయకుడిని నెలకొల్పుతున్నారు.

ప్రతీ పనిలో తోడుండాలని..



మనం చేసే ప్రతీపనిలో గణపతి తోడుండాలనే సంకల్పంతో రైతులందరం కలిశాం. 11ఏళ్లుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నాం. పంటలు బాగా పండి కుటుంబాలు సంతోషంగా ఉండడంతో రైతుకు సహాయం చేస్తున్న గణపతి విగ్రహాలను నెలకొల్పుతున్నాం.

– జక్కుల ముత్యం, యువరైతు, కుంటాల

మతసామరస్యాన్ని చాటిన వైద్యుడు


విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కేహెచ్ ఖాన్, నాయకులు

ఖానాపూర్: పట్టణా నికి చెందిన ఖాజా క్లిని క్ ఆస్పత్రి వైద్యుడు కేహెచ్ ఖాన్ తన ఆస్పత్రిలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. ఈ నెల 18న విగ్రహాన్ని ప్రతి ష్ఠించిన కేహెచ్ ఖాన్ మూ డు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం రాత్రి భక్తిశ్రద్ధల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఇందులో హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సురేష్, శెట్టిశ్యాం, మాజీ సర్పంచ్ నేరెళ్ల సత్యనారాయణ, బీజేపీ జిల్లా నాయకులు మదిర సత్యనారాయణ ఉన్నారు.

పదేళ్లుగా విభిన్న ఆకృతుల్లో..


వినాయకుడి పూజలో యూత్ సభ్యులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ధగడ్ యూత్ సభ్యులు ప్రతియేటా వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో విగ్రహాలను ప్రజలకు అవగాహన కల్పించే రీతిలో ప్రతిష్ఠిస్తున్నారు. ఈసారి ఉయ్యాలలో గణపతిని ఆకట్టుకునేలా ఉంది.

మట్టి గణపతి



భైంసా: భైంసాలోని సాక్షి రెస్టారెంట్‌లో ఐదు అడుగుల మట్టి గణపతి ఆకట్టుకుంటుంది. అక్కడ పనిచేసే ఒరిస్సా కార్మికులు మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఒరిస్సాకు చెందిన కార్మికుడు తపన్‌దుత్త మట్టి గణపతిని తయారుచేశాడు. ఈ గణపతిని చూసేందుకు పలువురు భక్తులు తరలివస్తున్నారు.

మట్టితోనే తయారు చేస్తాం



వేలల్లో ఖర్చుచేసి విగ్రహాలను ప్రతిష్ఠించకుండా ఇలా మట్టితో తయారు చేస్తే పర్యావరణానికి మేలు. మా ప్రాంతంలో ఇలా మట్టితోనే విగ్రహాలు తయారు చేసుకుంటాం. ఒరిస్సా నుంచి వచ్చినమేమంతా యేటా వినాయక చవితిని జరుపుకుంటాం. ఈసారి మట్టితో ఐదు అడుగుల విగ్రహాన్ని తీర్చిదిద్దాను.


– తపన్‌దుత్త

ఎకో ఫ్రెండ్లీ పేపర్ మట్టి గణపతి


శివలింగంపై కొలువుదీరిన గణపతి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెంది న వంశీకృష్ణ పదమూడేళ్లుగా పేపర్, మట్టి గణపతులను తయా రు చేస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆదర్శ యూత్ యువకుల సాయంతో గణనాథులను తయా రు చేస్తూ పర్యావరణా నికి హాని కలగకుండా ఎకో ఫ్రెండ్లీ పేపర్, మట్టి గణపతి విగ్రహా లను తయారు చేస్తూ స్థానిక పెద్ద హనుమా న్ ఆలయంలో ప్రతిష్ఠిస్తున్నారు.

మహాగణపతి.. నమోనమామి


48అడుగుల గణపతి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహణకు 8 దశాబ్దాల చరిత్ర ఉంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఆదిలాబాద్ జిల్లాలోనే గణేష్ చతుర్థి ఉత్సవాలను ఎంతో వైవిధ్యంగా నిర్వహిస్తారనే పేరు ఉంది. పట్టణంలోని కుమార్‌పేట్ కాలనీలో 1979 నుంచి ప్రతిష్ఠిస్తున్న కుమార్ జనత గణేష్ మండలికి ఎంతో ప్రత్యేకత ఉంది. స్థానికంగా నూతిమీది గణపతిగా వ్యవహరించే ఈ వినాయక మండలి ఆధ్వర్యంలో ప్రతీ ఏటా భారీ లంబోదారున్ని ప్రతిష్ఠిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈసారి సైతం 48అడుగుల భారీ గణనాథున్ని ప్రతిష్ఠించడం విశేషం.

33ఏళ్లుగా నిర్విఘ్నంగా గణపతి ఏర్పాటు


శివగణేష్ యూత్ ఆధ్వర్యంలో..

తాంసి: మండల కేంద్రంలో శివ గణేష్ మండలి ఆధ్వర్యంలో 33ఏళ్లుగా నిర్విఘ్నంగా గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఏటా వివిధ రకాల ఆకృతుల్లో మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వినాయక చవితి కోసం పోగు చేసే డబ్బులను సైతం ఆదా చేస్తూ శివాలయం నిర్మాణానికి సైతం డబ్బులను అందిస్తున్నారు. అక్కడ యువత అంతా ఐక్యంగా ఉంటూ వేడుకలు నిర్వహించుకుంటారు.

విద్యుత్ అధికారులపై గ్రామస్తుల దాడి


అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామంలో విద్యుత్ బిల్లుల వసూలుకు వెళ్లిన అధికారులపై గ్రామస్తులు దాడి చేశారు. పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్పీడీఎసీఎల్ డీఈ హరికృష్ణ, ఏఈ గంగాధర్, లైన్ఇన్‌స్పెక్టర్ మోహన్, లైన్‌మన్ ప్రేమ్‌కుమార్, జేఎల్ఎం సతీష్, మరో ముగ్గురు అన్‌మ్యాన్డ్ వర్కర్స్ బుధవారం సాయంత్రం గ్రామానికి వెళ్లారు. 210 కనెక్షన్లకు సంబంధించి రూ.36లక్షలు బిల్లు పెండింగ్‌లో ఉంది. బిల్లు చెల్లించకపోవడంతో ఎస్సీ కాలనీలో 150ఇళ్ల కనెక్షన్లు తొలగించారు. దీంతో గ్రామస్తులు కోపోద్రిక్తులై అధికారులపై దాడి చేశారు. అందరినీ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు చివరకు విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించారు. ఎస్సై పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకొని అధికారులను అక్కడి నుంచి ఆదిలాబాద్‌కు తరలించారు. కాగా, నోటీసు ఇవ్వకుండా కరెంట్ కట్ చేయడం సరికాదంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీలకు 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన కూడా అధికారులు వేధించడం సరికాదని వాపోయారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను దూషించడం, దాడికి పాల్పడడంతో గ్రామానికి చెందిన పలువురిపై ఏఈ గంగాధర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

ఎదులాపురం: రిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న జక్కుల శిల్పపై గురువారం ఓ రోగి బంధువులు దాడికి పాల్పడ్డారు. టుటౌన్ ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. రోగి బంధువులైన ముజాహిద్, అతడి తల్లి రేష్మ బంధువుని పరామర్శించేందుకు గురువారం ఆస్పత్రిలోని గౌనిక్ వార్డుకు వెళ్తున్నారు. వార్డు క్లీనింగ్ సమయంలో సెక్యూరిటీ గార్డు జక్కుల శిల్ప గేటు వద్ద లోనికి వెళ్లకుండా వారిని అడ్డుకుంది. క్లీనింగ్ చేస్తున్నారని, కొంత సమయం వేచి ఉండాలని కోరగా రేష్మ ఆమెను దూషించగా ముజాహిద్ స్టూల్‌తో దాడికి పాల్పడ్డాడు. శిల్ప ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్కే కాలనీలో గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పేకాటాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి రూ.1,850 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రైతు ఆత్మహత్య

తలమడుగు: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ధనశ్రీ వివరాల ప్రకారం.. కొత్త నందిగామ గ్రామనికి చెందిన సేడ్మాకి భీంరావు(49) తనకున్న మూడెకరాల పోడుభూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో పాటు కుమార్తెలను ఎలా చదివించాలని నిత్యం మదనపడేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి పశులపాక సమీపంలో పడిపోయాడు. కుటుబీ కులు గమనించేలోగా మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

నర్సాపూర్(జి): మండలంలోని నందన్ ఎక్స్‌రోడ్డు సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు అదుపు తప్పి కారుబోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ వివరాల మేరకు... మహారాష్ట్రలోని యావత్ మాల్ జిల్లా పంధర్కవాడ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మారుతీ ఎక్స్ క్రాస్ కారులో నాందేడ్ వెళ్తుండగా 61వ జాతీయ రహదారిపై మండలంలోని నందన్ ఎక్స్ రోడ్డు సమీపంలో కారు హ్యాండిల్ లాక్ పడటంతో ప్రమాదవశాత్తు పంట పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎదులాపురం: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పర్ధాన్ సాంగి గ్రామానికి చెందిన మధుకర్ (48) రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. టుటౌన్ పోలీసు అధికారి ముకుంద్‌రావు కథనం ప్రకారం.. పర్ధాన్ సాంగికి చెందిన మధుకర్ మద్యానికి బానిసయ్యాడు. పనిపాట లేకుండా మద్యం సేవిస్తుండడంతో కుటుంబీకులు మద్యం మానేయాలని వారించేవాడు. ఈనెల 18 పశువుల పాకలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.

ఆదివాసీ మహిళకు ఎంతకష్టం

- పురుటినొప్పులతో తల్లడిల్లిన నిండు గర్భిణి
- వాగు కారణంగా గ్రామానికి చేరుకోని 108
- వానలో వాగుదాటి పురుడుపోసిన సిబ్బంది
- తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలింపు


భీంబాయి, శిశువుతో 108 ఈఎంటీ శంకర్

ఉట్నూర్‌రూరల్: ఓ వైపు జోరు వాన కురుస్తోంది. మరో వైపు నిండు గర్భిణి పురుటినొప్పులతో ప్రసవ వేదన పడుతోంది. ఆస్పత్రికి తరలించాలంటే మధ్యలో వాగు దాటాల్సి ఉంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వాగు అవతలి భీంగూడ వద్దకు మాత్రమే రాగలిగారు. కానీ.. ఆమెకు ఎలాగైనా పురుడుపోయాలని తపనపడ్డారు. అతికష్టం మీద వాగు దాటి వచ్చారు. మహిళకు పురుడు పోసి తల్లీబిడ్డను కాపాడగలిగారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం మండంలోని చిన్నుగూడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి ఆత్రం భీంబాయికి పురిటినొప్పులు వచ్చాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించారు. చిన్నుగూడ నుంచి వాగు వరకు వస్తున్న క్రమంలో భీంబాయికి పురుటినొప్పులు అధికమయ్యాయి. దీంతో అక్కడే ఆగిపోయారు. విషయం తెలుసుకున్న వాగు అవతలివైపు భీంగూడ వద్దకు చేరుకున్న 108 సిబ్బంది స్పందించారు. భీంగూడ వద్దే అంబులెన్స్‌ను నిలిపి కాలినడకన ప్రవహిస్తున్న వాగు దాటి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గిరిజన సంప్రదాయం కారణంగా ప్రసవ మహిళకు గ్రామస్తులు దూరంగా ఉంటారు. దీంతో చేసేదేమీలేక ఈఎంటీ శంకర్, పైలట్ సచిన్ అన్నీ తామై వాగు ఒడ్డున వర్షంలో భీంబాయికి గొడుగు కిందే పురుడు పోశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఆమెను స్ట్రెచర్‌పై వాగులోంచి మోసుకువెళ్లి అంబులెన్స్ వద్దకు చేర్చారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆపద నుంచి మహిళను రక్షించడంతో గ్రామ పటేల్, భీంబాయి కుటుంబీకులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేటు ఎత్తివేత



భైంసాటౌన్: ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ప్రాజెక్టు అధికారులు ఒక గేటు ఎత్తి 3700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగుతుంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చింతలమానెపల్లి: మండల కేంద్రానికి చెందిన బుర్రి శ్రీనివాస్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11న శ్రీనివాస్ కూలిపనికి వెళ్లాడు. మరుసటి రోజు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి 20న మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఇంగు శంకర్, తాటి మల్లేశ్ చితకబాదడంతోనే మృతి చెందాడని మృతుని భార్య శ్రీలత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డురాదు

- ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డురాదని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం ఉమ్మడి జిల్లా అండర్ 17 బాలికల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మీరాబాయి చాను ఎంతో కష్టపడి కామన్వెల్త్ పోటీల్లో పతకాన్ని సాధించారన్నారు. అటువంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో మెరుగైన నైపుణ్యాలను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ దిశగా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ విద్య తెలిపారు. తొలి రోజు వాలీబాల్, టెన్నికాయిట్, క్యారమ్ పోటీలను నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పోటీలు మూడు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, పెటా సెక్రటరీ స్వామి పాల్గొన్నారు.

గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి

ఖానాపూర్: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) జాతీయాధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నర్సాగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మూడో జిల్లా మహాసభల్లో మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ సెక్రటరీ జనరల్ సిద్ధిరాములుగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బాలరాజ్‌గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు నర్సింలుగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు కిరణ్, స్వామి, సంజీవ్, శ్రీనివాస్, మురళి, నారాయణ, నాగరాజుగౌడ్ హాజరై మాట్లాడారు. జనాభాలో 12శాతం ఉన్న గౌడ కులస్తులకు దామాషా ప్రకారం చట్టసభల్లో సీట్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీతా వృత్తిని మత్తుపానియాల జాబితా నుంచి తొలగించాలన్నారు. జనగామ జిల్లాను సర్వాయిపాపన్న జిల్లాగా మార్చాలని డిమాండ్ చేశారు. గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు వెంటనే పంపిణీ చేయాలని తెలిపారు. పాపన్నగౌడ్ పోరాడిపాలించిన ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. గీతా కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ప్రకటించడంతో పాటు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. కార్మికుల ప్రమాదబీమాను రూ.10లక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లాగౌడ్, రాజారాంగౌడ్, చిన్ననర్సాగౌడ్, శంకర్‌గౌడ్, రాజేందర్ గౌడ్, వెంకాగౌడ్, భూమన్న ఉన్నారు.